ఆక్రమణలకు కేరాఫ్ పాతబస్తీ

- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న రహదారులు
- ఏ రోడ్డు చూసినా ట్రాఫిక్ కష్టాలే
- అల్లాడుతున్న వాహన చోదకులు
- పాదచారులకు సైతం తప్పని ఇబ్బందులు


బ్రాహ్మణ వీధిలో ఆక్రమణలతో ట్రాఫిక్ కష్టాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆక్రమణలకు కేరాఫ్‌గా పాతబస్తీ మారింది. పాతబస్తీలోని వీధులన్నింటిని వాహనాలతో ఇతర దుకాణాలతో ఆక్రమించటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పాతబస్తీలో ఆక్రమణల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు యావత్ పాతబస్తీ వీధులన్నింటిలోనూ వాహనాల సంగతి పక్కన పెడితే కనీసం పాదచారులు సైతం నడుచుకుంటూ ముందుకు వెళ్లలేని పరిస్థితులు నెలకున్నాయి. ఎటు చూసినా రోడ్డును ఆక్రమించి ఉండటంతో వాహన చోదకులు చక్కగా ముందుకు వెళ్లలేక గంటల కొద్ది ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి అవస్థలు పడుతున్నారు. వీటిపై అటు పోలీసు శాఖ గానీ, నగరపాలకసంస్థ గానీ పట్టించుకోకపోవటంతో ప్రజల పరిస్థితి దారుణంగా తయారైంది.

లక్షలాది మంది రాకపోకలు

పాతబస్తీలో వేలాది దుకాణాలు కొనసాగుతుంటాయి. ఇరుకు వీధులు, చిన్నచిన్న దుకాణాలతో నిత్యం వినియోగదారులతో పాతబస్తీ రద్దీగా దర్శనమిస్తుంది. ఈ పాతబస్తీలోని వ్యాపార దుకాణాలకు నిత్యం లక్షలాది మంది వినియోగదారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే వారంతా పాతబస్తీ వీధుల్లో ఉన్న ఆక్రమణలతో అల్లాడుతున్నారు. పాతబస్తీలోని బ్రాహ్మణవీధి, శివాలయం వీధి, మొయిన్‌బజార్, రాంగోపాల్‌వీధి, పులిపాటి వారి వీధి, శేషయ్యవీధి, భావనారాయణ వీధుల్లో ఆక్రమణల చెరతో స్థానిక నివాసితులు సైతం రాకపోకలు సాగించాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుంది.

అమ్మవారి భక్తులకు ఇక్కట్లే..

పాతబస్తీలోనే ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ కొలువై ఉంది. అమ్మవారి దర్శనార్థం నిత్యం వేలాది మంది పాతబస్తీలో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే పాతబస్తీలోని ఆలయ పరిసర ప్రాంతాలతో పాటుగా కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ ఆక్రమణలు భారీగానే ఉన్నాయి. ఆక్రమణల కారణంగా భక్తులు సైతం ఇక్కట్లపాలవుతున్నారు. రథం సెంటర్‌లో ఇటీవల కొన్ని ఆక్రమణలను తొలగించినా ఇంకా పరిస్థితులలో మార్పు రాలేదు. ప్రధానంగా రథం సెంటర్ నుంచి నెహ్రూబొమ్మ సెంటర్ వరకూ ఉన్న బ్రాహ్మణవీధిలో దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. అలాగే మరికొంతమంది వాహనాలను పూర్తిగా రోడ్డుపైన పార్కింగ్ చేయటం, వాటికి సరైన నియంత్రణ లేకపోవటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పోలీసుల నిఘా పెరగాలి

వ్యాపారులు ఏ విధమైన వ్యాపారం చేసుకున్నా ఆ పరిసరాల్లో ట్రాఫిక్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా పోలీసు శాఖ సరైన పర్యవేక్షణ లేకపోవటంతో పాతబస్తీలో రాకపోకలు సాగించాలంటే నరకం కనిపిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధాన వ్యాపార కేంద్రాలైన శివాలయం వీధి, భావనారాయణవీధి, పులిపాటి వారి వీధి, మొయిన్‌బజార్, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో సరైన పర్యవేక్షణ ఉంటే ట్రాఫిక్ సమస్యలకు చెక్కు పెట్టినవారవుతారని స్థానిక నివాసితులు చెబుతున్నారు. ఆ దిశగా పోలీసు శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పాతబస్తీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా చిల్డ్రన్స్ సెమీ క్రిస్మస్



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జీసస్ గాస్పల్ చర్చి, అష్యూరెన్స్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం చిల్డ్రన్స్ సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని చర్చి ఆవరణలో బిషప్ డాక్టర్ నేలపాటి విక్టర్ జీవన్ పాల్, సుజాతల ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ ఆదిరాల అభిషిక్త పర్యవేక్షణలో చిన్నారులచే డ్యాన్స్, నృత్య రూపకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ బి.హేమ, సత్యవాణి, జవాజి శామ్యూల్, థామస్ పాల్, చైతన్య, మేరీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించడానికి నగరపాలక సంస్థ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలోని జోనల్ ఆఫీసుల్లో కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నగర పాలకసంస్థ సమస్యలపై ప్రజలు సమీపంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని, ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులకు ఫిర్యాదులను అందించవచ్చని వివరించారు.

హనుమత్ దీక్షాపీఠంలో హోమాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షాపీఠంలో ఆదివారం రుద్రాభిషేకం, రుద్రహోమాలను నిర్వహించారు. దీక్షాపీఠం ఆవరణలోని శ్రీ లలితా గౌరీ నాగలింగేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం జరిపారు. పీఠాధిపతి శ్రీదుర్గా ప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీరమా వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతాలను ఆచరించారు. వ్రతంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పీఠంలో నూతనంగా శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణానికి సంబంధించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీలలితా గౌరీ నాగలింగేశ్వర స్వామివారికి అన్నాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ, హనుమాన్ నామ సంకీర్తనలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు కార్తిక వన సమారాధన భోజనాలు చేశారు.

ముగిసిన కార్తిక మాసోత్సవాలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ దర్బేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక మాసోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో స్వామివారికి పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రాంపిళ్ల జయప్రకాష్, దేవీ ఉపాసకులు అజిత్‌సింగ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తిక మాసం ముగింపు రోజున వేలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్తిక మాసం సందర్భంగా స్వామివారిని నిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారన్నారు. భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు మురళి, అర్చకులు చంద్రశేఖర్, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ స్థానిక ప్రముఖులు గూడేల సత్యనారాయణ, తమ్మిన సూర్యకుమారి, తమ్మిన అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీతోత్సవాలు

విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యాన దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఎనిమిది రోజులుగా నిర్వహిస్తున్న 31 వ వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. సంగీతానికి ఎల్లలు లేవని చాటుతూ విఖ్యాత హిందూస్తానీ విద్వాంసుడు సంతోష్‌కుమార్ వయొలిన్‌పై వాగ్గేయకారుల కీర్తనలను పలికించారు. తబలాపై రాజ్‌కుమార్ నహర్ సహకరించారు.

రామలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం


స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


దేవస్థాన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో ఆదివారం స్వామి వారికి అన్నాభిషేకం జరిగింది. లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, అనంతరం మహా పూర్ణాహుతిని నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి వారికి మాజీ మంత్రి, వైఎస్సార్ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఆలయ కమిటీకి, ఉభయ దాతలకు, భక్తులకు పంపిణీ చేశారు. తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి 11 రకాల పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహిచగా, పలువురు భక్తులు, ఉభయ దాతలు పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కులమతాలకు అతీతంగా తరలివచ్చిన భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

కొత్తపేటలో..

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి ఆదివారం మహా అన్నాభిషేకం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చన నిర్వహించిన అనంతరం అన్నంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించగా, ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. 5 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసరావు శర్మ మాట్లాడుతూ కార్తిక మాసం ప్రారంభానికి ముందు నుంచే స్వాములు, అయ్యప్పలకు ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. అన్న ప్రసాద వితరణను ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించగా, ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ, కుంచెం శ్రీనివాసరావులతో పాటు పలువురు ఉభయ దాతలు, భక్తులు సహకరించారన్నారు.

కాయిన్ ఎక్స్‌పోను సందర్శించిన కలెక్టర్


ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరంలో శ్రీధర్ సీసీఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాయిన్ ఎక్స్‌పో– 2024 ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు జరిగిన ప్రదర్శనను 35వేల మంది తిలకించారు. చివరి రోజు ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కుటుంబంతో వచ్చి ప్రదర్శనను తిలకించారు. గుంటూరు మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ చక్రవర్తి ప్రదర్శనను సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కరెన్సీ నాణేలు, నోట్లలో ఆ దేశ చరిత్ర, సంస్కృతి ప్రతిబింబిస్తుందన్నారు. గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నాణేలు, కరెన్సీల సేకరణ కేవలం హాబీగా మాత్రమే కాదని, జ్ఞానం పెంపొందించే విద్య అని కొనియాడారు. సీఐడీ డీఎస్పీ కె చక్రవరి మాట్లాడుతూ ఈ సంపదను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. నిర్వాహకులు కలెక్టర్ లక్ష్మీశ, గుంటూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, చక్రవర్తిలను ఘనంగా సత్కరించారు. తానా పూర్వ అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు, తానా సభ్యులు జిల్లెలుమూడి వెంకట్, తానా మాజీ కార్యదర్శి కొల్లా అశోక్, నిర్వాహకులు కొమ్మూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు చెల్లించండి

విజయవాడస్పోర్ట్స్: క్రీడాకారులకు పెండింగ్‌లో ఉన్న నగదు ప్రోత్సాహకాలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె.పి.రావు కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆయన ఆదివారం లేఖ రాశారు. కొత్త క్రీడా పాలసీ ప్రకారం ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారులకు రూ.7 కోట్లు ఇస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రభుత్వం ఇచ్చే నగదు ప్రోత్సాహకాలు రూ.12 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని వెంటనే మంజూరు చేసి క్రీడాకారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర క్రీడాకారులకు కోచింగ్ క్యాంప్‌లను నిర్వహించాలని, అంతర్జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు క్రీడా సామగ్రి కొనుగోలు, రవాణా నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) విజయవాడ బ్రాంచి 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బోడేపూడి హనుమయ్య, కార్యదర్శిగా డాక్టర్ వుమ్మినేని సురేష్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఎంవీ సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర వివిఎస్ వరప్రసాద్, డాక్టర్ వి పద్మజ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ పి సుశీల, డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా డాక్టర్ పరుచూరి అనీల్‌కుమార్, డాక్టర్ పి.జయకర్‌బాబు, అకడమిక్ సభ్యుడిగా డాక్టర్ మెహబూబ్ షేక్, సభ్యులుగా డాక్టర్ పీవీ సోనీలాల్, డాక్టర్ కదీర్‌షరీఫ్ మరో 30 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరిని పూర్వ అధ్యక్షుడు చలసాని ప్రమోద్ తదితరులు అభినందించారు.

రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం



విజయవాడ కల్చరల్: కోసూరి రవికుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని భాషావేత్త డాక్టర్ పాపినేని శివ శంకర్ అన్నారు. సాహితీ మిత్రులు ఆధ్వర్యాన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం కోసూరి రవికుమార్ రచించిన దాపల కవితా సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన శివ శంకర్ మాట్లాడుతూ రవికుమార్ నిరంతర అధ్యయన శీలి అన్నారు. ఆయన కవిత్వమంతా సమాజం చుట్టూ తిరుగిందన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రవికుమార్ కాలక్షేపంగా కవితా వ్యవసాయం చేయలేదని అక్షరాల కూర్పుతో రాజనాలు పండించినట్లు తెలిపారు. కవి పుప్పాల శ్రీరాం కవితా సంపుటి విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు బండ్లమాధవరావు, సుధారాణి రవికుమార్ సాహిత్య జీవిత విశేషలను వివరించారు. రవికుమార్ మాట్లాడుతూ సుదీర్ఘ విరామం తరువాత కొత్త కవితా సంపుటి తీసుకువచ్చామన్నారు. అనిల్ డ్యానీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యాపారులందరూ సమష్టిగా ముందుకు సాగాలి


మాట్లాడుతున్న కేవీబీ విజయవాడ డివిజన్ ఏజీఎం ప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వ్యాపారులందరూ సమష్టిగా ముందుకు సాగినప్పుడే ఆ సంఘం విజయాలను అందుకుంటుందని కరూర్ వైశ్యాబ్యాంక్ విజయవాడ డివిజన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని నగరానికి సమీపంలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు.

లక్ష దీపార్చన..

ఈ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అలాగే ఉసిరి చెట్టు కింద పూజలు నిర్వహించి లక్ష దీపార్చనను జరిపారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు కరూర్ వైశ్యాబ్యాంక్ అండగా ఉంటుందన్నారు. వ్యాపార వర్గాలు ఈ విధమైన కార్యక్రమాల ద్వారా ఒత్తిడిని దూరంగా ఉంచటమే కాకుండా ఆధ్యాత్మిక చింతనను అందిస్తాయని చెప్పారు. ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.

చురుగ్గా సామాజిక కార్యక్రమాలు..

సభకు అధ్యక్షత వహించిన సంఘ అధ్యక్షులు గోకవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ.. సంఘం ఆధ్వర్యంలో కేవలం తమ వ్యాపారులకే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గడ్డం సత్యనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గడ్డం బాలవెంకటరవికుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా రాజా, వాసవీ ఫౌండేషన్ చైర్మన్ వీవీకే నరసింహారావు, గోసంరక్షణా కేంద్రం మాజీ అధ్యక్షుడు చింతలపూడి రఘురామ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీరం బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మసునం కృష్ణారావు, సహాయ కార్యదర్శి దుర్గా సత్యనారాయణ, కోశాధికారి పువ్వాడ తాండవ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనూ లయన్స్ క్లబ్ సేవలు


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కోలా విజయశేఖర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రానున్న రోజుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ లయన్స్ క్లబ్‌ల ద్వారా సేవలు అందిస్తామని లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెడికల్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యాధరపురం అరవింద వీధిలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శేషగిరి ప్రారంభించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో ఎముకల సాంద్రత నిర్ధారణ, స్త్రీల ఆరోగ్య సమస్యలు, దంత, నేత్ర సమస్యలు, ఊపిరితిత్తులు, రక్తపోటు, మధుమేహ వ్యాధి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

600 మందికి వైద్య పరీక్షలు..

ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ దేవతి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు కోలా విజయశేఖర్, కుందా శ్రీధర్, ఇమ్మిడిశెట్టి సందీప్ కుమార్, కోలా శాంతి, సంతోష్‌లు మొత్తం 600 మందికి వైద్య సేవలు అందించారని చెప్పారు. ముకుందా ఫార్మసీ అధినేత హరినాథ్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలోఎస్‌వీవీఎస్‌వీ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు పైడిమర్రి వేణుగోపాలరావు, కార్యదర్శి పువ్వాడ లక్ష్మీ శ్రీనివాస్, కోశాధికారి గుర్రం లక్ష్మీనారాయణ, సభ్యులు కొనకళ్ల విద్యాధరరావు, టి.వాసుదేవ గుప్తా, జి.వినయ్, బి.కృష్ణమూర్తి, రంగనాయకులు, డాక్టర్ మధుమిత, హైస్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక నక్తదీక్షా మహోత్సవాలు


జగన్మోహినీదేవిగా భ్రమరాంబ అమ్మవారు


రామలింగేశ్వరస్వామి సన్నిధిలో వెలంపల్లి పూజలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు ఆదివారం జగన్మోహినీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కార్తిక నక్తదీక్షా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పలు విశేష కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో కార్తిక నక్త దీక్షా మహోత్సవం 30వ రోజు(చివరి రోజు) జగన్మోహినీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేక పుష్ప అలంకారం గావించారు. అలాగే చండీ హోమం, రుద్ర హోమం నిర్వహించి పూర్ణాహుతితో కార్యక్రమాలకు స్వస్తి పలికారు. సాయంత్రం పంచహారతులు అనంతరం చతుర్వేద స్వస్తి, ఆశీర్వచనం, భరత నాట్యం, కోలాటం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి వారి సన్నిధిలో మాలధారణ, ఇరుముడి కార్యక్రమాలు, రాత్రి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

రామలింగేశ్వరస్వామి సన్నిధిలో..

కొత్తపేట కొండపైన ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉత్సవాల ముగింపు సంసదర్భంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

వరద బాధితులకు రోటరీ ఇంటర్నేషనల్ సాయం


కిట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల సంభవించిన బుడమేరు వరద బాధితులకు రోటరీ ఇంటర్నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ కింద నిత్యావసర సరుకుల కిట్లను అందజేసింది. గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో క్లబ్ డీజీ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఐపీడీజీ దత్త సుబ్బారావు, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పార్థసారథి యడ్ల పాల్గొన్నారు.

రూ.21 లక్షలతో సాయం..

ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గొల్లపూడి అధ్యక్ష, కార్యదర్శులు ముట్లూరు దుర్గారావు, మద్దాళి శ్రీనివాస్ కుమార్, కోశాధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. బుడమేరు వరద ముంపులో వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని గుర్తు చేశారు. ప్రకృతి విపత్తుల సందర్భంగా వివిధ రూపాలలో సేవలు అందించే రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ వరద బాధితుల సహాయార్థం రూ.21 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. తద్వారా వరద ప్రభావిత ప్రాంతాలలో సర్వం కోల్పోయిన సుమారు వెయ్యి కుటుంబాలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామని చెప్పారు. తమ క్లబ్ పక్షాన ఇప్పటికే అనేక మంది వరద బాధితులకు సాయం అందజేశామని పేర్కొన్నారు.



భవానీ ద్వీపంలో కార్తిక సందడి

కార్తికమాసం చివరి ఆదివారం సందర్భంగా భవానీ ఐల్యాండ్‌లో వనభోజనాల సందడి కనిపించింది. కుటుంబ సభ్యులతో ద్వీపానికి వచ్చిన సందర్శకులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఆటలాడుతూ, ఉయ్యాల ఊగుతూ, సెల్ఫీలు తీసుకుంటూ ఐల్యాండ్ అంతా తిరిగారు. సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపి ఇంటి ముఖం పట్టారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

తల్లీకుమారుల అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భార్య, రెండేళ్ల కుమారుడు కనిపించడం లేదంటూ ఆటో డ్రైవర్ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లేబర్‌కాలనీకి చెందిన ఉదయ్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. 2019లో సుంకర నాగసాయి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి చంద్రకిరణ్ కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో నాగసాయి తన భర్త ఉదయ్‌కుమార్‌పై పోలీసులు ఫిర్యాదు చేసింది. ఇద్దరినీ పోలీసులు కౌన్సెలింగ్‌కు పంపారు. గత నెల 29న కౌన్సెలింగ్ వెళ్లి సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఉదయ్‌కుమార్ ఆటో తీసుకుని బయటకు వెళ్లాడు. తిరిగి రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా భార్య నాగసాయి, కుమారుడు చంద్రకిరణ్ ఇద్దరు కనిపించలేదు. ఉదయ్‌కుమార్ అత్తకు ఫోన్ చేసి అడగగా తన వద్దకు రాలేదని చెప్పింది. బంధువులు, చుట్టుపక్కల వారిని విచారించిన ఆచూకీ తెలియలేదు. దీనిపై ఉదయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన భార్య మరో వ్యక్తితో చనువుగా ఉంటుందని, అతనితో వెళ్లి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.